# అభివృద్ధి, సంక్షేమానికి జై..

బేగంపేట్ అక్టోబర్ 17: ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి జై కొడుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో మంగళవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ వెంగల్‌రావునగర్‌కు బీజేపీ కార్యకర్తలు మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో యూత్ అధ్యక్షుడు సాయినాథ్, జనరల్ సెక్రటరీ రవికుమార్, సాయిదీపక్, సందీప్, శ్రీకాంత్, సన్నీ, ఉదయ్, అఖిల్ ఉన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

## మరోసారి ఆశీర్వదించండి

ఆర్కేపురం, అక్టోబర్ 17 : నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబితాఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీ ఫామ్ అందుకొని మొదటిసారి చిత్రలేఅవుట్ కాలనీకి వచ్చానని, మీ ఆడబిడ్డగా చూపిన ఆదరాభిమానాలు ఎప్పటికి మర్చిపోలేను అన్నారు. అభివృద్ధిని చూసి తనకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు.

## మ్యానిఫెస్టోతో ప్రత్యర్థులకు.. మైండ్ బ్లాక్


బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళా నేతలతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

చంపాపేట, అక్టోబర్ 17 : బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోతో ప్రత్యర్థులకు మైండ్ బ్లాక్ అయిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ సీతారామ బస్తీకి చెందిన కరాటే యాదమ్మ, పలువురు మహిళలు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... ఎల్బీనగర్‌లో ప్రత్యర్థి పార్టీలు ఎన్ని వ్యూహాలు రచించినా విజయం బీఆర్‌ఎస్ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు మధుసూదన్‌రెడ్డి, అంజిరెడ్డి, కృష్ణమాచారి, కర్మన్ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, చంపాపేట డివిజన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రోజారెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, సత్యప్రకాశ్, శేఖర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, జగదీశ్ గౌడ్, వసంతరెడ్డి, లక్ష్మి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ వైపు యువత

మేడ్చల్ రూరల్, అక్టోబర్ 17: సీఎం కేసీఆర్‌పై ఉన్న నమ్మకంతోనే యువత బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు సీఎం సభా ప్రాంగణంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ యువ నాయకులు రాజిరెడ్డి, రాకేశ్, అరుణ్, తేజ, మధుసూదన్ రెడ్డి, గణేశ్, ప్రిన్స్, భరత్, శుభం, వెంకట్, సత్య, తేజ, ఉమా ప్రసాద్, మధురెడ్డితో పాటు 50 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులకు గులాబీ కండువా కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి

## పింఛన్ డబ్బులు ఇచ్చి.. గెలిచిరావాలని దీవించి..!

మల్లాపూర్, అక్టోబర్ 17: ఓ దివ్యాంగురాలు తన పింఛన్ డబ్బులను ఇచ్చి.. ఎన్నికల్లో గెలిచిరావాలని ఉప్పల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని దీవించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మీర్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్, లక్ష్మీనగర్, చైతన్యనగర్, ఫేజ్-2 ఇంద్రనగర్ కాలనీల్లో కార్పొరేటర్ జె.ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రచారం చేశారు. కైలాసగిరి బస్తీకి చెందిన ఉద్యమకారుడు బాలనర్సింహ కుమార్తె ఆనందం వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వం పెంచిన మొదటి నెల దివ్యాంగుల పింఛన్ రూ.4016ను బండారి లక్ష్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


ప్రభుత్వం పెంచిన మొదటి నెల పింఛన్ రూ.4016ను ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి అందజేస్తున్న దివ్యాంగురాలు

## గుబాలిస్తున్న గులాబీదళం


రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖాజామియాకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, అక్టోబర్ 17: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం గాజులరామారం, రంగారెడ్డినగర్ డివిజన్‌ల నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు సుమారు 500 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. పార్టీలో చేరే ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాన్నారు. జరగబోయే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కాలనీ అధ్యక్షుడు ఇబ్రహీంఖాన్, రంగారెడ్డినగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు, జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ మాజీ మైనార్టీ చైర్మన్ ఖాజామియా తదితరులు ఉన్నారు.

# ఒడిశా టూ మహారాష్ట్ర

### భారీ ఎత్తున గంజాయి స్మగ్లింగ్

- టీనాబ్, బొల్లారం పోలీసుల తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం
- నలుగురు అరెస్టు.. రూ. 3.5 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ఏపీ, ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్ జరుగుతుందనే పక్కా సమాచారంతో తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీనాబ్), బొల్లారం పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. రూ.3.5 కోట్ల విలువజేసే వెయ్యి కిలోల గంజాయితో పాటు రెండు వాహనాలను గుర్తించి పట్టుకున్నారు. ఈ వివరాలు టీనాబ్ ఎస్పీ సునీతారెడ్డి తెలిపారు. కర్ణాటకకు చెందిన సకారాం రాథోడ్ 2002లో హైదరాబాద్‌కు వచ్చి షేక్‌పేట్ ప్రాంతంలో పానీపూరి బండి నిర్వహించాడు. కొన్ని రోజుల తరువాత ఆ వ్యాపారాన్ని వదిలేసి బీదర్ వెళ్లాడు. అక్కడ తన తండ్రి పనిచేస్తున్న షుగర్ ఫ్యాక్టరీలో లేబర్ కంట్రాక్టర్‌గా చేరాడు. అక్కడ చాలా మంది కూలీలు గంజాయి తీసుకోవడం గమనించాడు. గంజాయి దందాతో పెద్ద మొత్తంలో సంపాదించవచ్చని భావించాడు. ఇందుకు ఒడిశా, ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న వారితో చేతులు కలిపాడు. మరో ముగ్గురితో కలిసి దందా షురూ చేశాడు. గంజాయి రవాణా కోసం ప్రత్యేకంగా డీసీఎం వాహనం కూడా కొనుగోలు చేశాడు. అహ్మద్‌ఖాన్‌ను డ్రైవర్‌గా, దిగాంబర్ రాము పవర్‌ను క్లీనర్‌గా నియమించుకున్నాడు. మల్కాన్‌గిరిలో సన్యాసిరావు అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనేందుకు రూ. 8 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చారు. వెయ్యి కిలోల గంజాయిని డీసీఎంలో లోడ్ చేసుకొని.. మహారాష్ట్రకు బయలుదేరారు. ముందు షిఫ్ట్ కారు పైలెట్‌గా వెళ్తుండగా.. వెనుక గంజాయితో ఉన్న డీసీఎం వస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు టీనాబ్, బొల్లారం పోలీసులు కలిసి బొల్లారంలో నిఘా పెట్టారు. రెండు వాహనాలు సీజ్ చేసి, వెయ్యి కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన సకారం రాథోడ్, అహ్మద్‌ఖాన్, దిగాంబర్‌తో పాటు వీరిని సికింద్రాబాద్‌లో కలుసుకోవడానికి వచ్చిన రమావతార్ చౌరస్యను పోలీసులు పట్టుకున్నారు.


పోలీసులకు పట్టుబడిన గంజాయి

## పేషెంట్ లా వచ్చి.. పెండ్లి చేసుకోవాలని వేధింపులు

### ఆకతాయి వేధింపులపై ఫిర్యాదు చేసిన ఫిజియోథెరపిస్ట్

వెంగళరావునగర్, అక్టోబర్ 17: ఇన్‌స్టాగ్రామ్‌లో యువతిని ఫాలో అయ్యాడు. ప్రేమించాలంటూ నిత్యం యువతికి సందేశాలు పంపాడు. పెండ్లి చేసుకోవాలని వేధించాడు. పేషెంట్‌లా వచ్చి ఫిజియోథెరపిస్ట్ అయిన ఆ యవతిని ఇబ్బందులకు గురి చేశాడు. అతడి ఆగడాలు భరించలేక ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సాయినాథ్ రెడ్డి కథనం ప్రకారం.. మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఓ యువతి (26 )ఫిజియోథెరపిస్ట్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నది. గత ఆగస్టు నెల నుంచి యువతికి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు కృష్ణానగర్‌కు చెందిన ఉమామహేశ్వర్‌రావు (28) అనే ట్రావెల్స్ నిర్వాహకుడు ఫాలో అవుతున్నాడు. యువతి ఫోన్ నంబర్‌ను సేకరించి, ప్రేమిస్తున్నానంటూ ఆమె ఫోన్‌కు తరచూ మెసేజ్‌లు పంపుతున్నాడు. ఓ రోజు యువతికి చెందిన ఫిజియోథెరపిస్ట్ క్లినిక్‌కు పేషెంట్‌లా వచ్చాడు. పెండ్లి చేసుకోవాలని వత్తిడి చేశాడు. నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. భయాందోళనకు గురైన ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.